నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, బుధవారం 20 నవంబర్ 2024 | SIDDIPET

డీడీఎస్ మహిళా రైతులకు పురస్కారం

జహీరాబాద్, నవంబర్ 19: జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ డీడీఎస్ మహిళా రైతులు ఇందిరా గాంధీ వ్యవసాయ పురస్కారం అందుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని జరిగిన కార్యక్రమంలో డీడీఎస్ మహిళా సంఘానికి చెందిన మహిళా రైతు జడల చంద్రమ్మ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి ఈ పురస్కారం అందుకున్నారు. కొర్ర, సజ్జ, సామ, జొన్న తదితర చిరుధాన్యాల పంటల్లో అధిగ దిగుబడులు సాధించేందుకు చేసిన కృషికి ఈ పురస్కారం అందజేశారు. డీడీఎస్ మహిళా సంఘాల ప్రతినిధులు సూర్యకళ, చాందీబాయి, సిబ్బంది నర్సమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భట్టి విక్రమార్క నుంచి అవార్డు అందుకుంటున్న చంద్రమ్మ

ఖాళీగా దర్శనమిస్తున్న ఎంపీడీవో కుర్చీ

మధ్యాహ్నం 12 గంటలు దాటినా తెరవని ఎంపీడీవో గది తలుపులు

ఏడాది పాలనపై నిట్టూర్పు..!

కాంగ్రెస్ పాలనలో గోసపడుతున్న మెతుకుసీమ.. ఏడాదిగా నిధులు లేవు... అభివృద్ధి జాడలేదు

- బీఆర్ఎస్ హయాంలో మంజూరైన నిధులు వెనక్కి తీసుకున్న సీఎం రేవంత్
- 100 నుంచి 50 సీట్లకు మెడక్ మెడికల్ కళాశాల కుదింపు
- రంగనాయక సాగర్ టూరిజం ప్రాజెక్టు రద్దు
- సిద్దిపేట జిల్లా నుంచి పలు విద్యాసంస్థలు తరలింపు
- అమలుకు నోచుకోని ఎన్నికల హామీలు
- ఏం చేశారని విజయోత్సవాలు అంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు

సిద్దిపేట, నవంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలనలో పాత మెడక్ జిల్లా అభివృద్ధి కుంటుపడింది.ఏడాదిగా జిల్లాకు ప్రభుత్వం నుంచి ఆశించిన నిధులు రావడం లేదు. దీంతో జిల్లా అభివృద్ధి పనులకు నోచుకోవడం లేదు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై నడుస్తున్న పనులు తప్పా మరోటి లేదు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏ ఒక్కటి పూర్తిగా నెరవేర్చ లేదు. ఏదో ఘనకార్యం చేసినట్లుగా ఏడాది పాలనపై కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు నిర్వహిస్తుండగా, విపక్షాలు విమర్శిస్తున్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు రాక పాలన కుంటుపడింది. మున్సిపాలిటీలు నిధుల లేమితో ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ప్రభుత్వం నుంచి నిధుల వరద పారింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో అభివృద్ధి పరుగులు పెట్టింది. కేసీఆర్, హరీశ్‌రావు జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతో పదేండ్లలోనే ఎంతో అభివృద్ధి జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లాపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. డిసెంబర్ 9తో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది పూర్తి కానున్నది. కానీ, ఈ ఏడాది పాలనలో జిల్లాలో పైసా అభివృద్ధి జరగలేదు.బీఆర్ఎస్ హయాంలో శ్రీకారం చుట్టిన అభివృద్ధి పనులకు నిధులు ఆపడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. రోడ్లకు మంజూరైన నిధులు ప్రభుత్వం రద్దుచేసింది. దీంతో దెబ్బతిన్న రోడ్లతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజల మధ్యన ఉండి అభివృద్ధి పనులు, కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేవారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో ప్రజల మధ్యకు రావడానికి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు భయపడుతున్నారు. పంట రుణమాఫీ పూర్తిగా కాలేదు. జిల్లాలో వేల మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. రూ.15 వేల చొప్పున ఇస్తామన్న రైతుభరోసా ఇవ్వడం లేదు. వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నాలకు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం మోసం చేసింది. రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు ఇస్తానని చెప్పి మోసం చేసింది. పత్తి, ధాన్యం సేకరణలో ప్రభుత్వ తీరుతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ అసమర్థతతో దళారులకు, వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నారు.

ఏం చేశారని విజయోత్సవాలు?

ఏడాది పాలనలో ఏం చేశారని విజయోత్సవాలు జరుపుతున్నారని జిల్లా ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసిన పనులకు నిధులు అపినందుకా ఈ విజయోత్సవాలు అని విమర్శిస్తున్నారు. సిద్దిపేట వెటర్నరీ కళాశాలను రద్దు చేసి, దాని నిర్మాణ పనులను ఫిల్లర్ల స్థాయిలోనే ఆపేశారు. రూ. 100 కోట్లు రద్దు చేయడంతో ఎంతో మంది విద్యార్థులను చదువుకు దూరం చేసింది కాంగ్రెస్ సర్కార్. జిల్లా రహదారులకు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన రూ.150 కోట్ల నిధులను రద్దు చేయడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. రంగనాయక సాగర్ టూరిజం ప్రాజెక్టును కక్ష కట్టి ప్రభుత్వం రద్దుచేసింది. సిద్దిపేట కోమటి చెరువు శిల్పారామం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. మెదక్ మెడికల్ కళాశాలను 100 సీట్ల నుంచి 50 సీట్లకు సీఎం రేవంత్ కుదించారు. గ్రామపంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పారిశుధ్య కార్మికులకు సరిగ్గా వేతనాలు రావడం లేదు. గత ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామాలకు నిధులు రాకపోవడవడంతో పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడుతున్నది. పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో ఉన్న చిన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలో మొత్తం 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేసీఆర్ ప్రభుత్వం అన్ని జీపీలకు పంచాయతీ కార్యదర్శులను నియమించింది.కార్యదర్శులపై ఆర్థిక భారం పడకుండా నెలనెలా పల్లె ప్రగతి ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేసింది.దీంతో గ్రామాలు అభివృద్ధి జరిగింది. పచ్చని చెట్లు, పారిశుధ్యం, ఇంటింటా చెత్త సేకరణ సజావుగా చేపట్టారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ఆ పరిస్థితి లేదు. ఒక్క ఉచిత బస్సు ప్రయాణం హామీ తప్పా, మిగతావి ఏవీ అమలు కావడం లేదని ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై పెదవి విరుస్తున్నారు. మొత్తంగా చూసుకుంటే ఏడాది కాంగ్రెస్ పాలనపై ఏ ఒక్క వర్గం సంతోషంగా లేకపోవడం విశేషం.

సర్వే పేరుతో విధులకు డుమ్మా

వెల్దుర్తి, నవంబర్ 19: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పేరుచెప్పి కొందరు ప్రభుత్వ ఉద్యోగులు విధులకు డుమ్మా కొడుతున్నారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' జరిపిన పరిశీలనలో ఈ విషయం బయటపడింది. బదిలీపై వచ్చినప్పటి నుంచి వెల్దుర్తి ఎంపీడీవో ఉమాదేవి విధులకు సరిగ్గా హాజరు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటల దాటినా ఎంపీడీవో గది తలుపులు తెరుచుకోలేదు. ఎంపీడీవో కుర్చీ ఖాళీగా దర్శనమిచ్చింది. ఈ విషయమై కార్యాలయ సిబ్బందిని 'నమస్తే తెలంగాణ' ఆరాతీసింది. ఒకరు సర్వే తనిఖీకి వెళ్లిందని, మరొకరు కలెక్టరేట్‌కు పని నిమిత్తం వెళ్లినట్లు పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఎంపీడీవో ఉమాదేవిని 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో సంప్రదించగా.. తాను మంగళపర్తిలో సర్వేను పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తరువాత సర్వే జరుగుతుంది కదా అని ప్రశ్నించగా.. తండాలు, మధిర గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సైతం సర్వే చేస్తున్నారని, మంగళపర్తిలో కార్యదర్శి చేస్తున్న సర్వేను తాను పర్యవేక్షిస్తున్నానని తెలిపారు. మంగళపర్తి గ్రామానికి వెళ్లి కార్యదర్శి ఖదీర్‌ను ఆరాతీయగా సర్వే పరిశీలనకు కాని, పర్యవేక్షణకు ఎంపీడీవో గ్రామానికి రాలేదని తెలిసింది. మంగళపర్తి, మన్నెవారి జలాల్‌పూర్ గ్రామాలకు సర్వే సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఇరిగేషన్ ఏఈ జగత్ ప్రభ మంగళవారం మంగళపర్తి గ్రామాన్ని సందర్శించి, మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి వెళ్లినట్టు ఫోన్‌లో తెలిపారు. మన్నెవారి జలాల్‌పూర్ గ్రామానికి వెళ్లగా, తాను గ్రామంలో ఉన్నానని ఫోన్‌కు లొకేషన్ పంపు తానని చెప్పగా, ఎంతసేపు చూసిన ఎలాంటి స్పందన లేకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా, బిజీగా ఉంది. గ్రామంలో సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్‌ను ఆరాతీయగా గ్రామానికి ఎవరూ రాలేదని, తామే సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇలా సర్వే పేరుతో గ్రామాల్లో ఉన్నామంటూ కొందరు అధికారులు విధులకు డుమ్మా కొడుతున్నారు.

చనిపోయిన వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు

నర్సాపూర్, నవంబర్ 19: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం నారాయణపూర్ శివారులోని లచ్చిరాంతండా భూవివాదంలో చనిపోయిన వ్యక్తిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితుల వివరాల ప్రకారం.. లచ్చిరాంతండాలోని 200 సర్వే నెంబర్ భూ విషయంలో కొన్నేండ్లుగా తండావాసుల మధ్య వివాదం నడుస్తున్నది. రెండు నెలల క్రితం భూవిషయంలో తండాకు చెందిన దేవ్‌సింగ్, సూర్య, ఆంజనేయులు, విఠల్‌పై ఇంకోవర్గం వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పాత్‌లోత్ విఠల్ అనే వ్యక్తి ఏడేండ్ల క్రితం చనిపోయాడు. ఎలాంటి విచారణ చేపట్టకుండా అతనిపై ఏ4 ముద్దాయిగా ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. చనిపోయిన వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో ఎలా చేర్చుతారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు భూవివాదంలో తమ ప్రత్యర్థికి అనుకూలంగా వ్యవహరిస్తూ పూర్తి వివరాలు తెలుసుకోకుండా కేసులు నమోదు చేసి భయభ్రాంతులకు గురిచేశారని బాధితుడు దేవ్‌సింగ్ ఆరోపించాడు. ఈ విషయంపై ఎస్సై లింగంను వివరణ కోరగా.. విఠల్ అనే వ్యక్తి చనిపోయాడని విచారణలో తేలిందని, డెత్ సర్టిఫికెట్ సేకరించామని, పేరు తొలిగించి చార్జీషీటు వేస్తామని ఎస్ఐ తెలిపారు.

చౌటపల్లి గ్రామ పంచాయతీ వద్ద సమావేశమైన బాధిత రైతులు, అఖిలపక్షం నాయకులు

ఇండస్ట్రియల్ పార్కును వ్యతిరేకిస్తున్నాం

- కొంతమంది కలెక్టర్‌కు తప్పుడు సమాచారమిచ్చారు
- చౌటపల్లిలో సమావేశమైన సర్వే నంబర్ 312 బాధిత రైతులు

అక్కన్నపేట, నవంబర్ 19: సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి స్టేజీ వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని సర్వేనంబర్ 312 బాధిత రైతులు స్పష్టం చేశారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులు, అఖిలపక్ష నాయకులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ... పట్టాలు లేని గ్రామానికి చెందిన కొంతమంది స్వలాభం కోసం ఇండస్ట్రియల్ పార్కుకు అనుకూలంగా ఉన్నామని కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. దీనిని గ్రామ రైతులు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అసలైన రైతులను తప్పుదారి పట్టించడానికి కొంతమంది స్వలాభం కోసం పని చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు సమాచారాన్ని తీసుకొని రైతులకు అన్యాయం చేయవద్దని కోరారు. మూడు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి భూములు ఇవ్వమని చెప్పినట్లు గుర్తుచేశారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు ఇల్లందుల జంపయ్య, వెల్ది రంగరావు, జనగామ వేణుగోపాల్‌రావు, గాదర్ల నాగభూషణం, చంచు శంకర్, బొడమల్ల భాగ్య, రైతులు పాల్గొన్నారు.

నర్సింగ్ కళాశాలకు భవనాన్ని సమకూరుస్తాం

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌లోని మెడికల్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు భవనాన్ని సమకూరుస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ పట్టణంలోని వైద్య కళాశాలలో ల్యాబ్స్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఎలక్ట్రికల్ వర్క్స్ త్వరితగతిన పూర్తి చేయాలని, హాస్టల్స్‌లో మరుగుదొడ్లు, మిగిలి ఉన్న పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వైద్య కళాశాలలో పారా మెడికల్ డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్, డిప్లొమా ఇన్ అనస్థీసియా టెక్నీషియన్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను కౌన్సెలింగ్ ద్వారా రిక్రూట్‌మెంట్ చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ తాగునీరు వైద్య కళాశాలకు అందిస్తామన్నారు. వైద్య కళాశాలలో పారా మెడికల్ సిబ్బంది నియామకం కోసం ఈనెల 25లోపు కౌన్సెలింగ్ నిర్వహించి ప్రక్రియ పూర్తిచేయాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కమలాదేవి, అధికారులు ఉన్నారు.

ముంపు బాధితులకు న్యాయం చేస్తాం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- అమీన్‌పూర్‌లో విస్తృతంగా పర్యటన

అమీన్‌పూర్‌లో కబ్జాలకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

అమీన్‌పూర్, నవంబర్ 19: అమీన్‌పూర్ మున్సిపలిటీ పరిధిలోని అలుగులు, చెరువులు, తూములను మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితులను కలిసి న్యాయం చేస్తామంటూ భరోసా కల్పించారు. పద్మావతి నగర్, వాణినగర్, చక్రపురి కాలనీ, వెంకటరమణ కాలనీ, వెదిరి కాలనీల్లోని వివాదాస్పద స్థలాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ ప్రభుత్వ స్థలాలను కాలినడకన తిరిగి కమిషనర్ పరిశీలించారు.అనంతరం బాధితులు, స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అక్కడి నుంచి శంభునికుంట లోని ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు ముంపు బాధితుల ఫిర్యాదు మేరకు చెరువును పరిశీలించినట్లు తెలిపారు. చెరువు విస్తీర్ణం 99 ఎకరాలు ఉందని, చెరువు అలుగు, తూములు మూసివేయడంతో నీరు వచ్చి చాలామంది ప్లాట్లు మునిగిపోయాయని గుర్తించామని, ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా కృషిచేస్తామని భరోసా ఇచ్చారు. అమీన్‌పూర్‌లో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురైనట్లు పెద్ద మొత్తంలో ఫిర్యాదులు వస్తుండడంతో ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించినట్లు తెలిపారు. కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించమని ఆయన హెచ్చరించారు. పద్మావతి నగర్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కబ్జా చేసినట్లు ఫిర్యాదు వచ్చిందని, సర్వేచేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో భారీ భవనాలపై ఎన్జీటీలో కేసులు ఉన్నాయని, వాటిని కూలంకశంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంకటరమణ కాలనీలో గోల్డెన్ కీ నిర్మాణదారులు పార్కు స్థలాల ఆక్రమణపై హైడ్రా అధికారులు ఇప్పటికే సర్వే చేశారని తెలిపారు. మరోసారి పరిశీలించి పార్కులు, ఓపెన్ స్థలాలు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారణ అయితే హైడ్రా తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. చెరువులు, కుంటలు పునరుద్ధరించడంతోపాటు రోడ్లను, పార్కులను ఆక్రమించకుండా హైడ్రా పనిచేస్తుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.

14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్, కలెక్టర్

గజ్వేల్/కొండపాక(కుకునూరుపల్లి), నవంబర్ 19: రాష్ట్రవ్యాప్తంగా రైతుల నుంచి 14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో రెండు రోజుల్లో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. మంగళవారం గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముతున్న రైతులను శాలువాలతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సన్నాలకు బోనస్ చెల్లిస్తున్నామని, ఇప్పటి వరకు రూ.15 కోట్లు చెల్లించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకు వరకు మిల్లులుండగా, కేవలం 362 మిల్లులకు మాత్రమే ధాన్యం ఇవ్వడం లేదన్నారు. సిద్దిపేట జిల్లాలో నాలుగు ఇప్పటి వరకు 90లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. నెల రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేసేలా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో తనూజ, తహసీల్దార్ శ్రవణ్, ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కార్యదర్శి జాన్ వెస్లీ, ఏవో నాగరాజు తదితరులు ఉన్నారు.

దుద్దెడలో...

దుద్దెడలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర సివిల్ సప్లై కమిషనర్ దేవేందర్‌సింగ్ చౌహాన్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి తనిఖీ చేశారు. వారి వెంట జిల్లా, మండల అధికారులు తదితరులు ఉన్నారు.

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 19 : కేంద్ర ప్రభుత్వం బీసీ గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందగోపాల్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేశ్, రక్షణ దళం రాష్ట్ర కన్వీనర్ ఉదయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈనెల 25న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తలపెట్టిన బీసీల సమరభేరి పోస్టర్‌ను మంగళవారం మెదక్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై క్రిమిలేయర్‌ను తొలిగించాలని, బీసీల అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తేవాలని డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమానికి ప్రత్యేకంగా బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రివర్యా..నేను గుర్తున్నానా..

నన్ను డాంబర్ రోడ్డు ఎప్పుడు జేత్తరు...

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 19: అయ్యా మంత్రివర్యా... నేను గుర్తున్నానా... తొమ్మిది నెలలక్రితం మట్టిరోడ్డుగా ఉన్న నన్ను డాంబర్ రోడ్డుచేయాలని శిలాఫలకం కూడా వేసిండ్రు. కానీ, ఇప్పటికి కూడా నేను గుంతలమయమైన మట్టిరోడ్డుగానే మిగిలిపోయాను. రోజు నామీద నుంచి పోయే బండ్లు, పెద్ద పెద్ద వాహనాల డ్రైవర్లు నన్ను బాగా తిట్టుకుంటున్నరు. ఎందీ ఈరోడ్డు.. ఎప్పుడు జేత్తరు అని మస్తు గరమైపోతున్నరు అందరు నామీద. నేను మంచిగలేనని చూసి రెండున్నర కోట్ల రూపాయలు నన్ను బాగుచేయడానికి పెట్టిండ్రు... సంబురంగా అందరు కొబ్బరికాయలు కొట్టి.. స్వీట్లు కూడా తిని పెద్దపెద్ద అక్షరాలతోని శిలాఫలకం అందరూ మస్తు మురిసిపోయేతట్టు ఏసిండ్రు. ఇది జేసినంక నా సంబురం ఆకాశమంత ఎత్తుకు ఎగిరినట్టు అయ్యింది... ఒర్నీ... నా సంబురం సల్లగుండ... ముందు మురిసినట్టే కాని... మల్ల నవ్వుల పాలు అయితన్న... నా రోడ్డు దిక్కుచూసినోళ్లు లేరు... ఆ పని జేసేటోళ్లు లేరు.. ఎందుకో అర్థమైతలేదు. ఈ పని జేపించే ఇంజినీరింగ్ సార్లు పట్టించుకుంట లేరో... నామీద డాంబర్ పోసే కాంట్రాక్టర్ వత్తలేడో తెలియదు కాని, నాకు మాత్రం ఎప్పటిలెక్కనే అందరితోనే తిట్ల పడుతున్న... వాళ్లు తిట్టుడు చూసి మస్తు బాధపడుతున్న... ఇగ మా హుస్నాబాద్ మున్సిపాలిటీ వాళ్లకు ఈ రోడ్డు మీదనే చెత్తతో ఎరువు తయారుచేసే పెద్ద పెద్ద షెడ్లు కూడా ఉన్నయి. దినాం పదకొండు ఆటోలు కూడా రోజు నామీదికెళ్లే నడుత్తన్నయి. వాటివి గేర్లు కరబ్ అవుడు... పట్టీలు పోవుడు అయితంది. చిన్న చిన్న రిపేర్లు వత్తన్నయి. వీటిని చేయించేతానికి పైసలు ఊక ఇయ్యాల్న అని మా మున్సిపల్ సార్లు కూడా గరం అవుతుండ్రని డ్రైవర్లు మస్తు బాధపడుతుంటే ఏడుపు వత్తంది. గట్ల ఎందుకు అయితంది అని అంటే గుంతలు ఉన్నయి ఏం సెయ్యాలే సారు అని సెప్పి మెల్లమెల్లగా పోతన్నమని మల్ల నన్నే డ్రైవర్లు తిట్టుకుంటండ్రు. నేను ఒక్కదాన్ని సెయ్యబట్టి బండ్లు కరాబు అవుడు. గంతుల కాడ మనుషులు కిందపడి దెబ్బలు తాకించుకునుడు... గిట్ల అందరికీ తకిలీబు అయితందని హుస్నాబాద్ నుంచి మందాపురం దాక మూడుకిలోమీటర్ల మేర డాంబర్‌రోడ్డు ఏయ్యడానికి సీఆర్ఆర్ కింద 2.50 కోట్ల రూపాయలతోనే మా బీసీ సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఫిబ్రవరి 26న పెద్ద శిలాఫలక ఏసిండ్రు. సంబురమయితే అయ్యింది. కానీ... డాంబర్ ఎయ్యలేదో... నా ముఖం అందంగా కాలేదు... మరి మంత్రి సారు నన్ను మరిసిపోయిండో ఏమో కాని... జర నా మీదక్కెళ్లి రోజు మందాపురం ఎల్లబోల్లు జర మీరన్న మంత్రి సాబ్‌కు చెప్పుండ్రి. నన్ను మంచిగజేసి తిట్టులేకుంట రయ్యరయ్యన పోయేతట్టు సెయ్యమని... మరి మంత్రిసారు సెప్పుతడో.. లేక పోనితీ అంటడో... దాని గాచారం గట్లనే పాడయ్యింది అని ఇడిసిపెడుతడో జర సూడలే మరి.

హుస్నాబాద్ టౌన్: హుస్నాబాద్ నుంచి మందాపురం వెళ్లే రోడ్డు దుస్థితి

సహకార సంఘాల అభివృద్ధికి కృషి

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, నవంబర్ 19: సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులను, మహిళలను ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని పలు వార్డుల్లో డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి, బుడగ జంగాల కాలనీ వద్ద మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం హుస్నాబాద్ సహకార పరపతి సంఘం నూతన భవనాన్ని ప్రారంభించి అక్కడే ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే బొప్పరాజు లక్ష్మీకాంత రావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు, యువత, మహిళల ఉపాధి కోసం హుస్నాబాద్ ప్రాంతంలో కాలుష్య రహిత వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను నెలకొల్పనున్నట్లు తెలిపారు. అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామ శివారును పారిశ్రామిక ప్రాంతంగా రూపదిద్దుతామని, ఇక్కడ సీడ్ ప్రాసెసింగ్ యూనిట్స్, రైస్ మిల్లులు, అగ్రికల్చర్‌కు సంబంధించిన పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి జరుగుతున్న భూసేకరణకు రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. హుస్నాబాద్‌లో ప్రారంభించిన వృత్తి నైపుణ్య కేంద్రాన్ని మహిళలు, యువత సద్వినియోగం చే